క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు పేర్కొన్నారు. డెంటల్, స్కిన్, హెయిర్స్‌కు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మాసబ్‌ట్యాంక్‌లోని ఫాతిమా రఫీ రెసిడెన్సీలోని రెవాస్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని అన్నారు. వైద్య నిపుణుల సలహాలు, సూచనలతో పాటు డిస్కౌంట్‌లో మందులను అందజేస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 90592 342089.

నియామకం


పండరీ

చాంద్రాయణగుట్ట: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కందికల్ గేట్ ప్రాంతానికి చెందిన డాక్టర్ బి.పండరీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.పండరీ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న తనకు స్టేషన్ కౌన్సిల్ మెంబర్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో ఆలయ ప్రతినిధులు రావుల శ్రీనివాస్, డీవీఎస్ రాజు తదితరులు

జియాగూడ: సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, దుల్జాభవాన్ని ఉమ్మడి ఆలయంలో శ్రావణ మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఆలయంలో మాతేశ్వరీలకు ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, అఖండ హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధి రాహుల శ్రీనివాస్, సంఘ సేవకుడు డీవీఎస్ రాజు మాట్లాడుతూ.. ప్రతియేటా శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’


అమర్‌సింగ్

గోల్కొండ: రాష్ట్రాన్ని తన అవినీతి పాలనతో నిండా ముంచిన సీఎం కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతారని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలియంగా ఉందని అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. కుటుంబ సంక్షేమం కోసమే కేసీఆర్ ఎన్నో స్కామ్‌లకు తెరలేపారని అన్నారు. ఉద్యోగాలు కల్పించలేకపోయిన కేసీఆర్‌కు నిరుద్యోగుల ఉసురు తగలకమానదని ఆయన అన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి


ఓటరు నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

యాకుత్‌పురా: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహ తెలిపారు. శనివారం ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ ఐడీ కార్డు కలిగిన వారు ఏవైన సమస్యలుంటే పోలింగ్ కేంద్రాల్లో సరి చేసుకోవాలన్నారు.

దివ్య ఖురాన్ బుక్ బాక్స్‌ల ఎగ్జిబిషన్ ప్రారంభం



చార్మినార్: మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ ఆధ్వర్యంలో దివ్య ఖురాన్ బుక్ బాక్స్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. నిజాం కాలంలో దివ్య ఖురాన్‌ను భద్రపరచడానికి వినియోగించిన 1400 ఏళ్ల నాటి కపడా కవర్లతో పాటు లేటెస్ట్‌గా రూపొందించిన దివ్య ఖురాన్ బుక్ బాక్స్‌లతో కూడిన ఎగ్జిబిషన్ కమ్ సెల్స్ శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. మహ్మద్ ఇలియాస్ బుకారీ మాట్లాడుతూ.. తమ వద్ద లేటెస్ట్ ఖురాన్ బాక్స్ ఖరీదు చేసే వారికి దివ్య ఖురాన్ బుక్‌ను ఉచితంగా అందజేస్తున్నామన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- రోడ్లపై ఎక్కడపడితే అక్కడే పార్కింగ్‌లు
- పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


షేక్‌పేట్ పాత ముంబై జాతీయ రహదారిపై..

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను వాటి యజమానులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడే గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, నానల్‌నగర్, షేక్‌పేట్ పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధిత అధికారులు ఎవరు కానరావడం లేదు. టోలిచౌకి చౌరస్తా, షేక్‌పేట్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, టోలిచౌకి సాలర్‌జంగ్ కాలనీలోని పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అక్రమ పార్కింగ్‌లే కనబడుతున్నాయి.

బారులుతీరుతున్న వాహనాలు..

- టోలిచౌకి నుంచి నానల్‌నగర్ సిగ్నల్ వరకు కిలోమీటర్ కూడా లేని దూరానికి కనీసం 20 నిమిషాల సమయం పడుతుంది.
- నానల్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న సిగ్నల్ వద్ద అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు సరైన ప్రణాళిక రూపొందించకపోవడంతో ఇక్కడ వాహనాలు వేల సంఖ్యలో బారులుతీరుతున్నాయి.
- అదేవిధంగా పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను నడిరోడ్డు వరకు నిలిపి ఉంచుతున్నారు.
- తనిఖీలు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే కొత్త వాహనాలను ఆర్టీఏ కార్యాలయం రోడ్డుకు అవతలి వైపున బారులు తీసి పార్కింగ్ చేస్తున్నారు.
- వాహనాల ఫిట్‌నెస్‌ను సంబంధిత అధికారులు రోడ్ల మీదనే కానిచేస్తున్నారు.
- ఇక్కడ ఫుడ్‌కోర్టులు ఉండడంతో లెక్కకు మించి వాహనాలు ఫుడ్‌కోర్టులకు వచ్చే వారు రోడ్ల పైనే పార్కు చేస్తున్నారు.
- ఆర్‌టీఏ కార్యాలయానికి సమీపంలోని షాగౌస్ హోటల్, షాగౌస్ బేకరీల ముందు కూడా వాహనాలు రోడ్డు వరకు బారులు తీసి ఉంటున్నాయి.
- టోలిచౌకి చౌరస్తా వద్ద గల రూమాన్ హోటల్, రహమత్ హోటల్, ఓడియం మాల్ ప్రాంతాల్లో కూడా రోడ్లపైనే అక్రమ పార్కింగ్‌లు సాగుతున్నాయి.
- గుడిమల్కాపూర్‌లోని పలు హోటళ్లు, రెస్టారెంట్ల ముందు సైతం అక్రమ పార్కింగ్ కొనసాగుతున్నాయి.
- మెహిదీపట్నంలోని ప్రిన్స్ హోటల్, హసన్ రెస్టారెంట్ తదితర ప్రాంతాలు కూడా ట్రాఫిక్ పరంగా సమస్యాత్మకంగా మారాయి.
- ఈ హోటళ్ల ముందు వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపై పార్క్ చేసి ఉంటున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు..

- అక్రమ పార్కింగ్‌లను నివారించాల్సిన ట్రాఫిక్ పోలీసులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.
- ట్రాఫిక్ అధికారులు మారినప్పుడల్లా కొన్ని రోజులు హంగామా ఉంటుందని ఆ తరువాత షరామామూలే అన్నట్లుగా ఉంటుందని పలువురు అంటున్నారు.
- సాయంత్రం కాగానే ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల ఒకటి రెండు వాహనాలను రికవరీ వ్యాన్‌లో తరలిస్తున్నారు తప్ప అక్రమ పార్కింగ్ నివారణకు పటిష్టమైన చర్యలు ఇంత వరకు తీసుకున్న దాఖలాలు లేవు.
- ఏడాది 1-2 సార్లు తమ ప్రణాళికలో ఉన్న ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ట్రాఫిక్ పోలీసులు చేతులు దులుపుకుంటున్నారు.
- పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



చార్మినార్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్, చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీ.వెంకన్న సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా శనివారం జోనల్ కమిషర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓ పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న నమోదు కార్యక్రమంపై చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డీడీ నాయక్‌తో ఆరా తీశారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 27వ తేదీ, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఉంటుందన్నారు.

అలరించిన భక్తి సంగీత కీర్తనలు



సుల్తాన్‌బజార్: తెలంగాణ భాషా సాంస్కృతిక సౌజన్యంతో రాంకోఠిలోని శ్రీశక్తి గణపతి ఆలయంలో శని, ఆదివారాల్లో శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శ్రీనివాస్‌యాదవ్ బృందం సంకీర్తన మంజరి అనే కార్యక్రమం నిర్వహించింది. శ్రావణ మాసం సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారి కీర్తనలు, భద్రచల రామదాసు కీర్తనలు, సర్వాంగ కళాకారులు గానం చేశారు. అంతా రామమయం..కృష్ణ పాండవ కృష్ణ.., పలుకే బంగారమాయానా.. లాంటి ప్రసిద్ధి చెందిన కీర్తనలతో భక్తులను భక్తిపారవశంతో ముంచెత్తారు. డాక్టర్ సురేష్ గౌడ్, సాయిబాబా, రూప, విజయ్‌భాస్కర్, టెంపుల్ చైర్మన్ సత్యనారాయణయాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో హరితహారం


మొక్కలు నాటుతున్న ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా తదితరులు

గోల్కొండ: పచ్చదనంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉంటుందని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెండ్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు. శనివారం ఆస్పత్రిలో బయోడైవర్‌సిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆస్పత్రికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని అన్నారు. పచ్చదనంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అందుకే తాము ఆస్పత్రి ప్రాంగణంలో వివిధ రకాలైన మొక్కలను నాటుతున్నామని వీటిలో అరుదైన పూల మొక్కల జాతులు కూడా ఉన్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లు, వారి సహాయకులకు ఇక్కడి పచ్చదనం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌రావు, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులున్నారు.

మిత్రకృష్ణను భారీ మెజార్టీతో గెలిపిస్తాం


మిత్రకృష్ణను సన్మానిస్తున్న ఇంద్రానగర్ ఆదిజాంబవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మిత్రకృష్ణను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆది జాంబవ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. జియాగూడ ఇంద్రానగర్ ఆది జాంబవ సంక్షేమ సంఘం మిత్రకృష్ణకు పూర్తి మద్దతును అందజేస్తామని శనివారం ప్రకటించారు. అనంతరం వారు మిత్ర కృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.రఘునాథ్, టి.యాదయ్య, ఎం.కిషన్, జి.చెన్నయ్య, ఎం.బాలకృష్ణ, ఎస్.అనిల్ కుమార్, పాలెం వెంకటేష్, ఎం.సత్యనారాయణ, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ యువతకు ఆదర్శం కావాలి



అంధ క్రికెట్ క్రీడాకారులను సన్మానిస్తున్న ఆంజనేయగౌడ్, వివేక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అంధ క్రీడాకారుల అద్భుత ప్రతిభ యువతకు ఆదర్శం కావాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ అంధుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని అంధ క్రికెట్ క్రీడాకారులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ క్రీడారంగంలో పారా ఒలింపియన్లు అద్భుతమైన విజయాలను సాధిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ వివేక్, తెలంగాణ అంధుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షుడు హరీష్, కార్యదర్శి అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


అధికారులతో సమావేశమైన సెషన్స్ జడ్జి ప్రేమావతి

నాంపల్లి: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సెషన్స్ జడ్జి ప్రేమావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ అంశంపై మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు యూనిట్ జ్యుడిషియల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రేమావతి మాట్లాడుతూ.. సెప్టెంబరు 9న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రమాకాంత్, రెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి భూపతి, పన్నెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అనిత, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ పాల్గొన్నారు.

‘గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం’

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గానికి చెందిన గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌కుమార్ తివారి (గుల్లుమహారాజ్) పేర్కొన్నారు. గోషామహల్ కాంగ్రెస్ టికెట్ కోసం గాంధీభవన్‌లో ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం సుధీర్‌కుమార్ తివారి మాట్లాడుతూ.. 25 ఏళ్లకు పైగా గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులుగా కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నానన్నారు. తనకు టికెట్ కేటాయిస్తే గోషామహల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని పేర్కొన్నారు.


గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న సునీల్‌కుమార్ తివారి

భారతదేశం గొప్ప వనరులు కలిగిన దేశం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

గన్‌ఫౌండ్రీ: భారతదేశం మానవ వనరులు, మౌలిక సదుపాయాలు సాంకేతికతను కలిగిన గొప్ప దేశమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. మనకు ఉన్న వనరులను సరిగ్గా ఉపయోగించినప్పుడు 2047 నాటికి భారతదేశం పూర్తి స్వాలంబన కలిగిన దేశంగా మారుతుందన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో 2047 నాటికి భారత దేశ అభివృద్ధికి గల దారి అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశం భారతదేశమన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రోగ్రామ్ మేనేజర్ జానకి రామ్, ప్రొఫెసర్ డి.శ్రీరాములు, కళాశాల ప్రిన్సిపాల్ ఆంథోని సగయ రాజ పాల్గొన్నారు.

కార్వాన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి


బల్దియా జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన బల్దియా జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రేతో కలిసి టోలిచౌకి, హకీంపేట్, గోల్కొండ, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే బల్దియా జోనల్ కమిషనర్‌కు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూపించారు. ఈ పనులు సుదీర్ఘ కాలంలో సాగుతుండడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల గురించి ఆయన బల్దియా జోనల్ కమిషనర్‌కు వివరించారు. పనులు సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లకు ఆ పనుల టెండర్‌ను రద్దు చేసి ఇతరులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బాల్‌రెడ్డినగర్, లంగర్‌హౌజ్, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైనేజీ పనులను ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పూర్తి కానిపనుల విషయమై తాను బల్దియా కమిషనర్ రోనాల్ రోస్‌ను కలిసి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చిన కూడా అధికారుల్లో స్పందన లేదని ఆయన అన్నారు. పలువురు బల్దియా అధికారులతో పాటు మజ్లిస్ కార్పొరేటర్ మహ్మద్ నజీరుద్దీన్, బదరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

నిరుద్యోగులకు జాబ్‌మేళాలు వరం


సర్టిఫికెటను అందజేస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: నిరుద్యోగులకు జాబ్‌మేళాలు వరంగా మారాయాని, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సిక్వాల్ ప్రగతి సమాజ్ యూత్ వింగ్, రాజస్థానీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బేగంబజార్‌లోని సిక్వాల్ భవన్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి తోడుగా సంఘాలు, సమాజాలు చేపడుతున్న జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం గత సంవత్సర కాలంగా నిరుద్యోగులకు పలు నోటిఫికేషన్లు విడుదల చేసి వారికి అండగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు ప్రగతి సంక్షేమం అందిస్తుందని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. 22 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా 40 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీలలో ఉద్యోగులుగా ఎంపికయ్యారు. సందీప్‌జైస్వాల్ జాబ్‌మేళా నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. రామ్‌దేవ్ నాగుల, గోపాల్ బల్‌దేవ, అమృత్‌కుమార్ జైన్, పండిట్ పురుషోత్తమ్, ఆశీష్ పండిట్ పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన సలావుద్దీన్ లోధి

చార్మినార్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నిర్వహించిన ఓటరు నమోదు పరిశీలన కార్యక్రమాన్ని శనివారం చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈవీఎం మెషన్ల పనితీరు, సక్రమంగా పని చేస్తుందో లేదో అనే తదితర విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఈ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రత్యేక పూజల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో విష్ణు సహస్రనామ పారాయణము, విశ్వక్షేణ పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, బృత్విక్ వరణం, మృత్స్యాంగ్రహణం, అంకురార్పణం, వైనతేయ, ధ్వజఛాయాదివాసం, మంగళశాసనం తదితర పూజలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెండింగ్ పనులను పూర్తిచేస్తాం


సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు సమస్యలు వివరిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేస్తామని సూపరింటెండెంట్ ఇంజినీర్ రత్నాకర్ సహదేవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని అబిడ్స్, ట్రూబజార్, గోషామహల్, ధూల్‌పేట్, జాంబాగ్, దారుసలాం, తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన సమస్యలను బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆయనకు వివరించారు. వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శేఖర్, నందుకుమార్, అహ్మద్, నరేష్‌గౌడ్, పరిషిత్ పాల్గొన్నారు.

29న చలో మైదాన్ పేరిట క్రీడోత్సవాలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో క్రీడా దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలో మైదాన్ పేరిట నిర్వహిస్తున్న ఈ క్రీడా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్, క్రీడాశాఖ డైరెక్టర్ లక్ష్మి, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి, గిరిజన ఆర్థిక సంస్థ చైర్మన్ రాంచందర్ నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్వారకానాథరావు సేవలు చిరస్మరణీయం

నాంపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థ వ్యవస్థాపక సభ్యులు, ఏపీఐఐసీ లిమిటెడ్ పూర్వ డీజీఎం ఎస్.ద్వారకానాథరావు సంస్మరణ సభ శనివారం ఏసీగార్డ్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వారకానాథరావు చిత్రపటానికి నివాళులర్పించి ప్రసంగించారు. సాంస్కృతిక రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, ద్వారకానాథరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

‘రక్షాబంధన్’కు సరిపడా బస్సులు

అఫ్జల్‌గంజ్: రక్షాబంధన్ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి సరిపడా బస్సులు అందుబాటులో ఉంచుతున్నామని టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి తోడు ఇకపై తమ ప్రయాణాలను ముందస్తుగా రిజర్వేషన్ చేయించునే వారికి రిజర్వేషన్ చార్జిగా రూ.50 వసూలు చేసేవారని, దానిని రూ.30కి తగ్గించామని తెలిపారు. ప్రయాణికులందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొని ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం చేయాలని సూచించారు.

సమాజ సేవకు నిరంతర కృషి



అబిడ్స్: జీవితాంతం సమాజ సేవకే అంకితమవుతానని టీఎస్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. అస్సద్ అన్వార్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద దాదాపు 600 మందికి అల్పాహార పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. తరచూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు ఆకలి తీరుస్తున్నానన్నారు. అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర నాయకులు శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, శంకర్, ముఖీంఖురేషి, అరుణజ్యోతి, శివకుమార్, శేఖర్, ముజీబ్, మహ్మద్ వహీద్, ఉస్మాన్ అలీ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.